# వీర నారి

శ్రీమతి బి. జ్ఞానాంబ గారు

చంద్రనగరసైన్యాధిపతియగు చందనసింహుఁడు రాజాజ్ఞచే రణరంగమునకు వెడలుచుండ అంతఃపురమునుండి అతని భార్య శక్తిమతీదేవి దూతికచే నిట్లు కబురంపెను. "జీవితేశ్వరా! మాతృదేశ గౌరవము మీవీరబాహువులపై నాధారపడి యున్నది. దానిని మొక్కవోకుండఁ గాపాడుట మీముఖ్యకర్తవ్యము. ఎట్టికఠోరకష్టసమయమందైనను కర్తవ్యమును విస్మరింపకుడు."

ఈసందేశము నాలకించినతోడనే చందనసింహుని మిత్రులెల్లరు పకపక నవ్వఁజొచ్చిరి. ఒకఁడు "ఆడుదానికింత యధికచనవుకూడదు." అనియెను. ఇంకొకఁడు "ఇదికూడా ప్రణయసందేశమే కాబోలు" అనియెను. వేరొకఁడు "వట్టి అమాయికురాలు, యుద్ధమనగా నింటిలోఁ గూర్చుండి వంటఁజేయుట యనుకొనినది" అనియెను. చందనసింహుని కాడువారియెడ నసలే విశ్వాసగౌరవములు లేవు. పైగా మిత్రుల పరిహాసప్రసంగములచే నతని కరికాలుమంట నెత్తికెక్కెను. క్రోధకర్కశస్వరముతో నతఁడిట్లనెను.

"చేటీ! మీయజమానురాలి యాజ్ఞకు సదాకృతజ్ఞుఁడను. తెరమఱుఁగునఁ బ్రొద్దుపుచ్చు నాడువారు బహిరంగయుద్ధమునఁ బ్రాణములర్పించు మగవారికి వీరధర్మములుపదేశింపవలసిన యవసరమింకను తటస్థింప లేదని మీయజమానురాలితో వచింపుము."

గజాశ్వముల ఘీంకారరవములతోఁ బాటు వీరభటుల వీరాలాపములు మిన్నుముట్టినవి. తళ తళ మెరసిపోవుచున్న వాఁడి ఖడ్గములతోఁ బాటు తలపుర్రెలు తాటికాయలవలె పైకెగసినవి. ఎడతెగకఁ బ్రవహించుచున్న రుధిరస్రవంతులలో వేలకొలది నిర్జీవశరీరములు తేలియాడినవి. సుశిక్షితులైన శత్రుసైనికులు సంఖ్యాధికులగుటచేఁ జంద్రనగరసైనికులకు జయాశ అంతరించెను. చందనసింహునికి నాలుగైదు తీవ్రగాయములు తగిలినవి. బుడ బుడఁ గారుచున్న రక్తముదిక్కుఁ జూచుకొనుచు నతఁ డిట్లనుకొనెను.

"ఛీ, ఛీ. ఆడుదాని యధికప్రసంగమునకు మోసపోయి వృథాగా నింతరక్తమును పాడొనరించితిని. దేశముసంగతి దేవుఁడెఱుఁగును. ప్రాణములుండిన బలుసాకుఁదిని జీవింపవచ్చునుగదా?" ఇఁక చెప్పవలసిన దేమున్నది? ఉభయసేనలు నిద్రాదేవిగాఢాలింగనమందు మైమరచి యున్నతఱి చందనసింహుఁడు మెల్లఁగా కాళ్లకు బుద్ధిఁజెప్పెను.

అదరుగుండెలతో, బెదరుచూపులతో, తడఁబడుచున్న కాళ్లు ఈడ్చుకొనుచు చందనసింహు డంతఃపురమును సమీపించెను. కవాటము బంధింపఁబడి యుండుటచే రెండు మూడు పర్యాయములు బిగ్గరగాఁ బిలిచెను. కానిలోపలినుండి ప్రత్యుత్తరము రాలేదు. చందనసింహుఁడది చూచి మండిపడుచు "గాయముల బాధచే నిలువెల్ల దహించుకొని పోవుచున్నది. త్వరగాఁ దలుపుఁదీయుఁడు. లేనిచో విరుగఁగొట్టివైచెదను. జాగ్రత్త." అని గర్జింపఁజొచ్చెను. కొంతసేపటి కొక పరిచారిక బయటికివచ్చి

"మహాప్రభో! మన్నింపుడు. ఇవిగో, ఈవస్తువులను ధరించినఁగాని తమకుఁ బ్రవేశమునకు వీలు కలుగదఁట" అని యొకచీరెయు, రవికెయుఁ, గొంతపసపుముద్దయు నాతని యెదుటఁ బెట్టెను. వాటినిఁ గాంచినంతనే చందనసింహుని కభిమానోదయ మయ్యెను. స్వామిభక్తిపరాయణులైన తోడిసైనికులను శత్రువుల భీకరఖడ్గప్రహారముల కొప్పగించి వచ్చిన తనభీరుత్వమునకుఁ దానేలజ్జించెను. అతనికిప్పుడు గాయములబాధ బొత్తిగా యగపడుటలేదు. వీరావేశముతో నతఁడిట్లనుకొనెను.

"కంచుకచేలముల మూలమున దేవియొసంగించిన యుపదేశ మమూల్యమైనది. ఖడ్గహస్తుఁడనగు నాకును కంకణహస్తయగు నామెకును తారతమ్య మంతగాఁగాని పించుటలేదు. విజయవంతుడనై యేతెంచితినేని దేవిదివ్యపరీరంభణము లభింపఁగలదు. లేదేని ముక్తికాంతామంగళపరిష్వంగము సిద్ధింపఁగలదు. ఎటులైన నొక్కటియే?"

ప్రళయసముద్రమువలె నుప్పొంగుచున్న శత్రుసేనలోఁ జొరఁబడి చందనసింహుడు విశృంఖల వీరవిహారమొనరించుచుండెను. నూతనోత్సాహప్రజ్వలితమైన యతని విక్రమధాటికాగఁజాలక శత్రుసేన యొకటి రెండుసారులు వెనుక కొదిగియు మరల విజృంభించెను. సంపూర్ణకవచధారియైన యోధుఁ డొకఁడాతనికి బాసటయై నిలిచి పగతురఁ బరిమార్చుచుండెను. చందనసింహుఁడా యోధుని పరాక్రమ నైశిత్యమున కచ్చెరువొంది తనలో "విలయరుద్రునివలె విరోధులనుక్కడఁగించుచు నితఁడు నాకొనరించున్న యుపకార మీజన్మములో మరువరానిది. ఇతఁడుండఁబట్టి సరిపోయినది. కాని లేనిచోఁ బగవారిదివరకే నన్నుఁబరిమార్చియుందురు." అనుకొనియెను. వివేష రక్తస్రావముచేఁ జందనసింహుని శక్తిక్రమముగా సన్నగిల్లుచుండెను. శిరోనేత్రములు గిరగిరఁదిరుగుచుండెను. పట్టుసడలుటచేఁ జేతిలో ఖడ్గము జారిపోవుచుండెను. శత్రుసైనికుఁ డొకఁ డీసమయముఁ గనిపెట్టి బల్లెముతో నతనివీపునఁ బొడిచెను. కవచధారియోధుఁడది చూచి తత్క్షణమే యచటికి లంఘించి గుఱ్ఱముపైనుండి పడిపోవుచున్న చందనసింహుని మెల్లగాఁ గ్రిందికి దింపి తొడలపై బరుండఁ బెట్టుకొని విచారగద్గదస్వరముతో

"నాథా! మీరు మీకర్తవ్యమును చక్కఁగా నిర్వహించితిరి. మీజీవితము పునీతమైనది. ఇఁక నేనును నాకర్తవ్యమును నిర్వహించుకొందును." అని వామహస్తమున మెరయుచున్న రక్తారుణకరవాలమును తినయురమునఁ గ్రుచ్చుకొనెను. మూతలు వడుచున్న నేత్రముల నతికష్టముమీద విప్పి విస్మయపూర్ణదృష్టులతో యోధుని వీక్షించుచు చందనసింహుఁడిట్లు పలికెను.

"వీరనారీ! నీవేనా? శహభాష్. పురుషులకంటె స్త్రీలే శౌర్యవంతులని నేనిప్పుడు గ్రహిం...చి...తి...ని". అతని ప్రాణవాయువు లెగిరిపోయెను. శక్తిమతీదేవి ప్రాణవాయువులు వానిననుకరించెనని మేము వేరుగాఁ జెప్పనవసరములేదు.

500